క్లుప్తంగా

రాజీ మార్గంలో కేసులు పరిష్కారం



నరసరావుపేట టౌన్: జాతీయ లోక్అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఒ.వెంకట నాగేశ్వరరావు కోరారు. శనివారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఇన్సూరెన్స్, ఆర్టీసీ లీగల్ కౌన్సిల్ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 13న నిర్వహించనున్న జాతీయ అదాలత్‌లో మోటర్ వాహన ప్రమాదాల కేసులు రాజీ మార్గంలో పరిష్కారం అయ్యే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. వినుకొండ బ్రహ్మంగారి దేవస్థానం, నూజెండ్ల మండలంలోని జంగాలపల్లి, నూజెండ్ల, పమిడిపాడు, తెల్లబాడు, అప్పాపురం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఆరాధన ఉత్సవాలు నిర్వహించేందుకు భక్తులు సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

1న పెన్షన్ల పంపిణీ

శావల్యాపురం: మండలంలోని వైఎస్సార్ సామాజిక పింఛన్లు నగదు 1వ తేదీన పింఛనుదారులకు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య శనివారం తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోని 5690 మంది లబ్ధిదారులకు రూ. ఒక కోటి 56 లక్షల 19వేల నగదు బ్యాంకు నుంచి డ్రా చేసి సచివాలయాల వారీగా అధికారులకు నగదును అందజేశామన్నారు. 1వ తేదీ ఉదయాన్నే ఆయా గ్రామాల్లోని వలంటీర్లు పింఛనుదారులకు నగదు పంపిణీ ప్రారంభించాలన్నారు.

వడ్డెంగుంటలో ఫ్యామిలీ ఫిజిషియన్

బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.వీరనరేష్ వైద్యసేవలు అందించారు. గ్రామంలో 95 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్యాధికారి తెలిపారు. వీరిలో కొందరు దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వైద్యసిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

4న పోట్లూరులో క్రికెట్ టోర్నమెంట్

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆశీస్సులతో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంటు పోటీలు వచ్చే నెల 4వ తేదీన ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. మొదట బహుమతి రూ.15,116, రెండవ బహుమతి రూ.10,116, మూడో బహుమతి రూ.7,116, నాల్గవ బహుమతి రూ. 5,116లు. మ్యాన్ ఆఫ్‌ది సిరిస్ షీల్డ్, రూ. 3,116 అందజేస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఎంట్రీ ఫీజు రూ.299లు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 8466095531, 6303601620 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అగ్నిప్రమాదంలో గడ్డివామి దగ్ధం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలోని అగ్నిప్రమాదం సంభవించి రెండు ఎకరాల వరిగడ్డి దగ్ధమైన ఘటన శనివారం జరిగింది. ప్రమాదవశాత్తూ గ్రామానికి చెందిన దాసరి రాజశేఖర్‌కు చెందిన వరిగడ్డి వామికి నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేపట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.20వేల వరకు ఆస్తినష్టం ఉంటుందని స్థానికులు తెలిపారు.

చెరుకుంపాలెంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెంలో పరి ఫౌండేషన్ అమెరికావారి సౌజన్యంతో, స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే 1 నుంచి జూన్ 15వరకు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు చెరుకుంపాలెం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తుమ్మా శౌర్రెడ్డి తెలిపారు. శిబిరాన్ని అచ్చంపేట తహసీల్దారు ప్రారంభిస్తారని చెప్పారు. కొత్తపల్లి, చెరుకుంపాలెం, చింతపల్లి గ్రామాలకు చెందిన మహిళలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆయన కోరారు.

జగనన్న పాలనలో రాష్ట్రంలో స్వర్ణయుగం

- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి
- దుష్ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- చందవరంలో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు వాటిని తిప్పికొట్టి ప్రభుత్వానికి మరింత మద్దతుగా నిలవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చందవరం గ్రామంలో శనివారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. గంగమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజల అనంతరం ఎస్సీ కాలనీలో పర్యటించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అమలవుతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాలనలో, సంక్షేమ పథకాల అమల్లో చరిత్ర సృష్టించిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో అన్ని పదవుల్లో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్దఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. దీంతో ఆయా వర్గాలకు పాలనలో భాగస్వామ్యం లభించిందన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు కావాల్సిన ప్రతి పథకాన్ని ఇంటి ముంగిటకే తెచ్చారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహనమిత్ర, లా నేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాల అమలుతో అన్ని వర్గాల్లో సంతోషాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణయుగం ఆవిష్కృతమైందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతమైన పాలనకు నిదర్శనమన్నారు. సుపరిపాలన, సంక్షేమ పథకాలు నిరంతరం సాగేందుకు ప్రజలు ఆశీస్సులందించారని కోరారు. జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, నాదెండ్ల, గణపవరం సొసైటీ చైర్మన్లు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, ఏజీపీ దాసరి చిట్టిబాబు, పార్టీ నాయకులు చేరెడ్డి అంకిరెడ్డి, సింగారెడ్డి కోటిరెడ్డి, కాట్రు రమేష్, విడదల గోపీ, చేరెడ్డి దశరథరామిరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, పి.రామకృష్ణ, ఆవుల గోపి, పూదోక గంగిరాజు, వనమాల వెంకటేశ్వర్లు, పసుపులేటి శ్రీను, చేరెడ్డి సుబ్బారెడ్డి, భాస్కరరెడ్డి, వెంకటరెడ్డి, అనంతరామిరెడ్డి, గొంటు అర్జున్‌రెడ్డి, రాఘవరెడ్డి, అప్పిరెడ్డి, రామిరెడ్డి, గొంటు హనిమిరెడ్డి, నారాయణరెడ్డి, మేకతోటి హనుమయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ లావు జన్మదిన వేడుకలు



ఎంపీకి గజమాల వేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న అభిమానులు

నరసరావుపేట: పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలోగల క్యాంపు కార్యాలయంలో ఉన్న ఎంపీ లావుకు శుభాకాంక్షలు తెలిపేందుకు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. కేక్‌లు కట్‌చేసి గజమాలలు వేసి శుభాకాంక్షలను తెలిపారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలి అని ఆకాంక్షించారు. అర్చకుల నుంచి ఆశీర్వచనాలు పొందారు. తనపై ఎంతో ప్రేమ, అభిమానంతో వచ్చి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పన్నెండో వార్డు ప్రజలకు రూ.9.76కోట్ల లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వార్డులో ఇప్పటివరకు ప్రజలకు రూ.9.76కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శనివారం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి పట్టణంలోని 12వ వార్డు ప్రకాష్‌నగర్‌లో వైట్ హౌస్, లైట్ హౌస్ నుంచి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంటింటికి తిరుగుతూ వారికి అందుతున్న సంక్షేమ పథకాలను గురించి తెలియచేస్తూ కరపత్రాలను అందజేశారు. స్థానికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ పాలనపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి కుటుంబంతోనూ మాట్లాడడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకుంటున్నామన్నారు. నవరత్నాలలో భాగంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహిళలు అందరూ స్వచ్ఛందంగా పాల్గొంటూ జగనన్నకు మద్దతు పలుకుతున్నారన్నారు. మరో 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా జగనన్న కొనసాగేలా తామంతా కృషి చేస్తామన్నారు. ప్రజలంతా చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు. సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముదిరాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ల డైరక్టర్లు ఈఎం స్వామి, ఎస్.సుజాతాపాల్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గంటెనపాటి గాబ్రియేలు, పట్టణ అధికార ప్రతినిధి భూమిరెడ్డి కొండారెడ్డి, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఎస్‌కే ఆంజనేయులు, నాయకులు సానికొమ్ము కోటిరెడ్డి, మోరా శ్రీపాల్ రెడ్డి, హాలీవుడ్ రఘు, గురుమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనపై ప్రజలకు పూర్తి విశ్వాసం

- 'జగనన్నే మా భవిష్యత్' ద్వారా ప్రజల నాడి వెల్లడి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి



పార్టీ కార్యాలయంలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని, ఆవిషయం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా పూర్తిగా తెలిసిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నేటితో కార్యక్రమం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం ప్రకాష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకర్లకు వివరాలను వెల్లడించారు. ఈనెల ఏడవ తేదీ నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో ప్రతి ఇంటికి తమ సైనికులైన గృహసారథులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు వెళ్లి ప్రభుత్వ పనితీరు, సీఎం జగన్ పాలన, గత టీడీపీ పాలనపై వారి అభిప్రాయాలను సేకరించి వారిచేత మిస్‌డ్ కాల్ చేయించారన్నారు. నియోజకవర్గంలో 87,546కుటుంబాలు ఉండగా 80,617 గృహాలకు (91.4శాతం) వెళ్లి కలుసుకోవటం జరిగిందన్నారు. తాను కూడా ప్రత్యక్షంగా పట్టణంలోని అనేక వార్డులు, గ్రామాలకు వెళ్లి పాల్గొన్నానని, ప్రభుత్వం ద్వారా తమకు మేలు జరుగుతుందని ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. దీనిని బట్టి సీఎం జగన్ ప్రభంజనం ఖాయమన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారానే తమకు పథకాలు అందుతున్నాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం చేశారన్నారు. పరిస్థితి ఈవిధంగా ఉంటే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో చేసిన పర్యటనల్లో ప్రజాస్పందన లేకపోవటంతో నిస్పృహతో సీఎం జగన్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. 2014ఎన్నికల్లో 600హామీలు ఇచ్చిన బాబు ఎన్ని నెరవేర్చాడో చెప్పాలని డిమాండ్ చేశారు. 120 హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి 98శాతం నెరవేర్చాడన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తానని, బంగారం బ్యాంకు నుంచి ఇళ్లకు తీసుకొస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు రైతులను నట్టేట ముంచాడన్నారు. ఇంటికో ఉద్యోగం, బాబు వస్తే జాబ్ వస్తుందంటూ నిరుద్యోగులను మోసం చేశాడన్నారు. ఎటువంటి లంచాలకు తావు లేకుండా నవరత్నాల పథకాల ద్వారా నాలుగేళ్లలో రూ.2.05లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి జగన్ వేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ఒకేసారి రాష్ట్ర చరిత్రలో 1.36లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలను ఎవరూ ఎక్కువకాలం మోసం చేయలేరని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు, అతడిని మోసే వారందరికీ పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. సమావేశంలో పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, ముదిరాజు కార్పొరేషన్ డైరక్టర్ ఈఎం స్వామి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పి.శివారెడ్డి, రొంపిచర్ల మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, వడ్డెర సంక్షేమ సంఘ జిల్లా సభ్యుడు వేముల శివ, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ ఎస్‌కే ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా పాల్గొన్నారు.

ముంపు సమస్య నివారణకు చర్యలు



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు



మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: పట్టణంలోని సంజీవనగర్ ముంపు సమస్య నివారణకోసం మాత్రమే సాయి కార్తీక్ సిటీ సెంటర్ వద్ద డ్రైన్ పైపులు తొలగించినట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శనివారం నిర్వహించారు. సమావేశానికి చైర్మన్ రఫాని అధ్యక్షత వహించారు. ఎజెండా పూర్తి అయ్యాక విపక్ష టీడీపీ కౌన్సిలర్లు సాయి కార్తీక్ సిటీ సెంటర్‌వద్ద డ్రైన్ నిర్మాణ విషయం ప్రస్తావించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వర్షాలు కురిసినప్పుడు డ్రైన్ కన్నా ఎత్తులో ఏర్పాటు చేసి పైపులైన్ల కారణంగా వర్షపు నీరు, మురుగునీరు ప్రవహించక, వెనక్కు తన్ని సంజీవనగర్ ముంపునకు గురి అవుతున్న నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పైపులు తొలగించినట్లు వివరించారు. ఈ పైపుల తొలగింపు కారణంగా సమస్య ఉన్నట్లు ఇప్పటివరకు సిటీ సెంటర్ యాజమాన్యం నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. ఈ విషయమై మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన ఉన్న డ్రైన్‌కు సంబంధించి ఎలాంటి నిర్మాణాలు చేయాలన్నా జాతీయ రహదారుల సంస్థ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇప్పటికే జాతీయ రహదారుల సంస్థ అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లామని, అనుమతులు వచ్చిన వెంటనే డ్రైన్ నిర్మాణం చేపడతామని వెల్లడించారు. అజెండాలో పొందుపరిచిన అక్రమ కుళాయిల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ రఫాని చెప్పారు. సభ్యులందరూ తగు సూచనలు చేస్తూ క్రమబద్ధీకరణ రుసుం నిర్ణయిస్తామని వెల్లడించారు. పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ పట్టణంలోని వీధి కుక్కల సమస్య అధికంగా ఉందని తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ వీధి కుక్కలను చంపరాదని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించడం ద్వారా మాత్రమే వాటిని నియంత్రించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకోబోతున్నట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

యడ్లపాడులో సీపీఎం ప్రచారజాత



యడ్లపాడు: రైతుల సాగులో ఉన్న ప్రభుత్వ భూములపై వారికే హక్కులు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బైక్, ఆటోలపై ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో బైక్ యాత్రను అన్ని గ్రామాల్లోనూ నిర్వహించినట్లు వెల్లడించారు. మే ఒకటి ప్రపంచ కార్మిక దినోత్సవం నాడు చిలకలూరిపేట కళామందిర్ సెంటర్లో రైతు సాగులో ఉన్న భూములకు పట్టా హక్కులు కల్పించాలంటూ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భూ హక్కుల పోరాట కమిటీ, వ్యవసాయ కార్మికసంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు జరిగే ఈసభకు నియోజకవర్గంలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ కోర్టు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ కోర్టును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న భూమి తగవులు, పొలం తగవులు, హద్దుల వివాదాలు తదితర రెవెన్యూ పరిధిలోకి వచ్చే సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ రెవెన్యూ కోర్టును నిర్వహిస్తుందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రెవెన్యూ కోర్టులో భూ వివాదాల ఫిర్యాదు చేసిన ఇరుపక్షాల వాదనలు విని వారికి ఉన్న భూమి హక్కు పత్రాలను పరిశీలించి ఆయా గ్రామ రెవెన్యూ రికార్డులు, వీఆర్‌ఓల సహకారంతో తనిఖీ చేసి వివాద పరిష్కారానికి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే పనుల్లో రైతుల భాగస్వామ్యం తప్పనిసరి

తహసీల్దార్ జాన్‌సైదులు



రీసర్వే పనుల పురోగతిపై మాట్లాడుతున్న తహసీల్దార్ జాన్‌సైదులు

శావల్యాపురం: రీసర్వే పనుల్లో రైతుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఐదు రెవెన్యూ గ్రామాల్లో కనమర్లపూడి రెవెన్యూ గ్రామం 3531.89 విస్తీర్ణం, పోట్లూరు -5077.59, వేల్పూరు -5477-97, శానంపూడి-6480.01, పిచికలపాలెంలో 3505.20 విస్తీర్ణం కలిగిన భూముల్లో రైతుల సమక్షంలో రోవర్, ఆధునిక యంత్ర పరికరాలతో రీసర్వే పనులు చేశామన్నారు. కనమర్లపూడి రెవెన్యూ గ్రామంలో రికార్డు పనులు పూర్తి చేసి ఫామ్ 9(2) నోటీసులు రైతులకు పంపిణీ చేయగా, త్వరలో భూహక్కు పత్రాలు అందజేస్తామన్నారు. పనులు పూర్తి అయిన గ్రామాల్లోని రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే సమగ్ర ఆధారాలతో రెవెన్యూ అధికారులను అందజేస్తే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. నాలుగు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తికాగా, ప్రస్తుతం రికార్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో ఈ రెవెన్యూ గ్రామాల్లోని రైతులకు ఫామ్ 9(2) నోటీసులు ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. మే 20 నాటికి నూరు శాతం పనులు పూర్తి అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య, మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం



ఎంపీడీఓ ఉషాకిరణ్‌కు ఆహ్వాన పత్రాలను అందజేస్తున్న గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు శాఖ గ్రంథాలయంలో ఆయా పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం మే 8వ తేదీ నుంచి జూన్ 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి గంటా శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో భాగంగా శనివారం ఎంపీడీఓ ఉషాకిరణ్, అధికారులు, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి వేసవి విజ్ఞాన శిబిరం ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ శిబిరం ప్రతి రోజూ ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, కథలు వినడం, గ్రంథాలయంలో ఉండే పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్, తెలుగు కాపీరైటింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, చెస్, క్యారమ్స్, జనరల్ నాలెడ్జ్ మొదలగు అంశాలపై శిక్షణ ఇస్తామని వివరించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు శిక్షణా శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించాలని తెలిపారు. ఈ శిక్షణా తరగతుల అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బాలికలకు నగదు బహుమతి అందజేస్తున్న జంగా నారాయణ

అందుకూరు(క్రోసూరు): పాఠశాల ముగింపు సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్స్ ప్రదర్శనను అభినందిస్తూ గ్రామ సర్పంచ్ భర్త జంగా నారాయణ నగదు బహుమతులు అందజేశారు. శనివారం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పాఠశాల ముగింపు సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలు డ్యాన్స్‌లో చూపించిన ప్రతిభకు మెచ్చుకుని గ్రామసర్పంచ్ జంగా సౌభాగ్యలక్ష్మి భర్త నారాయణ నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎ. కృష్ణంరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, తిరుమలరెడ్డి, గోవిందరెడ్డి, లక్ష్మి, సాయిబాబు, వెంకట్రావు, సత్యనారాయణ, హేమలత, ఎండీఎం సుమతి ,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు వావిలాల 20వ వర్ధంతి



వావిలాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు

సత్తెనపల్లి: స్వాతంత్య్ర సమరయోధుడు, పద్మభూషణ్, మాజీ శాసనసభ్యుడు వావిలాల గోపాల కృష్ణయ్య 20వ వర్ధంతి బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో నిర్వహించారు. వావిలాల గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ మాట్లాడుతూ వావిలాల పేద బడుగు బలహీన వర్గాల వారికి ఎంతో సహాయ సహకారాలు అందించి వారి తోడ్పాటుకు సహకరించారని ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన నిరాడంబరత, పట్టుదల, దేశం కోసం తను చేసిన గొప్ప పనులను ఈ సందర్భంగా ఉటంకించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి కొడవటికంటి నాగ పార్వతయ్య శర్మ, విఖనస మండలి అధ్యక్షుడు వేదాంత వెంకట రామకృష్ణమాచార్యులు, కొండ కావూరి మార్కండేశ్వర శర్మ, ధన్వంతరి తేజ, పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్

ముప్పాళ్ళ: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పల్నాడు జిల్లా డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ జి.చంద్రశేఖర్ శనివారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బందితోను సమావేశమయ్యారు. కాన్పులు పీహెచ్‌సీలోనే జరగాలని సూచించారు. ఫ్యామిలీడాక్టర్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవలే ఆసుపత్రిలో పూర్తయిన ఎన్‌క్యూఎఎస్ కార్యక్రమం తీరును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని వసతులను పరిశీలించి సిబ్బందిని అభినందించారు. ఆయనతో పాటుగా డీఎమ్‌హెచ్‌ఓ కార్యాలయ సూపరింటెండెంట్ అమృత, వైద్యులు పీ.రమాదేవి, జయకృష్ణప్రవీణ లు పాల్గొన్నారు.